


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

## ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

శనివారం 07 ఫిబ్రవరి 2026 పేజీలు 04


## ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్

# ప్రక్రియ పూర్తి

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.గంగాధర్, జిల్లా విద్యాధికారి యాదయ్య లతో కలిసి 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఒక బృందానికి 1 పి.ఓ., 1 ఎ.పి.ఓ., 3 ఓ.పి.ఓ. ల చొప్పున బెల్లంపల్లి మున్సిపాలిటీకి 68 బృందాలు, చెన్నూరు మున్సిపాలిటీకి 36 బృందాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీకి 45 బృందాలు, లక్సెట్టిపేట మున్సిపాలిటీకి 30 బృందాలు, మంచిర్యాల నగరపాలక సంస్థకు 265 బృందాలు రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సిబ్బంది వారికి కేటాయించిన స్థానాలలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం బెల్లంపల్లిలో మున్సిపల్ కార్యాలయంలో, చెన్నూర్ లో మున్సిపల్ కార్యాలయంలో, లక్షెట్టిపేటలో మున్సిపల్ కార్యాలయంలో, క్యాతనపల్లిలో మున్సిపల్ కార్యాలయంలో, మంచిర్యాల నగరపాలక సంస్థకు సంబంధించి నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని, 8, 9 తేదీలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. సర్వీస్ ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగం కోసం ఫారం 12, ఓటరు ఎపిక్ కార్డ్ తీసుకువెళ్లవలసి ఉంటుందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విజయవంతానికి అందరి సహకారం ముఖ్యం - ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**



ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు కోసం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, హాజరై మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో క్షేత్రస్థాయిలో పి ఓ లు, ఏ పి ఓ ల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి అంశానికి ప్రిసైడింగ్ అధికారి పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సుల నిర్వహణ, మాక్ పోలింగ్ నిర్వహణ, పోలింగ్ అనంతరం పత్రాల భద్రతలో ఏమాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. పోలింగ్ రోజున ముందుగానే కేంద్రాలకు చేరుకుని సన్నద్ధంగా ఉండాలని, చిన్న పొరపాటు కూడా ఎన్నికల ప్రక్రియపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు లేదా సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే సెక్టార్ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.శిక్షణలో భాగంగా అధికారుల అవగాహనను పరీక్షించేందుకు 50 ప్రశ్నలతో ప్రశ్నపత్రం నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన అధికారులకు, కలెక్టర్ వారిని శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రసంగాలు, పోస్టులపై కఠిన చర్యలు.-జిల్లా ఎస్పీ



**నిర్మల్ ప్రతినిధి ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్:** ఎన్నికల ప్రచారం సందర్భంగా సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే, విద్వేషపూరిత ప్రసంగాలు చేయడం, వాటిని వైరల్ చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల హెచ్చరించారు.ఇటీవల సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఓ ఘటన నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పట్టణంలోని ఎంఐఎం వార్డు అభ్యర్థి, నాంపల్లి ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర గ్రూపుల్లో అసభ్యకరమైన, అవమానకరమైన, విద్వేషపూరిత పోస్టులు, వీడియోలు లేదా వ్యాఖ్యలను ఫార్వర్డ్ చేసిన వారిపై మాత్రమే కాకుండా,అలాంటి విషయాలను ఫార్వర్డ్ చేయడానికి అనుమతించిన గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల స్పష్టం చేశారు.విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం, వాటిని సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేసారు.అదేవిధంగా, సోషల్ మీడియా గ్రూపులు, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలలో ఎవరు అయినా అసభ్యకరమైన, అవమానకరమైన, విద్వేషపూరిత పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేసినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీడా.జి.జానకి షర్మిల హెచ్చరించారు.జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా,స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలను కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో

# పురోగతి సాధించాలి

### - జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్ల నిర్మాణాలలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకాష్ రావు లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. మొదటి విడతలో 9 వేల 57 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 7 వేల 757



ఇండ్ల నిర్మాణ పనులు వివిధ దశలలో ఉన్నాయని, మిగతా 1 వేయి 300 ఇండ్ల పనులు ప్రారంభం కాకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పైలెట్ గ్రామాలలో ఇండ్లను మంజూరు చేసి సంవత్సరం పూర్తయిందని, మార్చ్ 31వ తేదీ వరకు పనులు ప్రారంభించని ఇండ్లను రద్దు చేయాలని, వివిధ దశలలో ఉన్న పనులను వేగవంతం చేసి మార్చిలో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, లబ్ధిదారులు ఇసుకను సద్వినియోగం చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇంకా పనులు ప్రారంభం కాని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధార్ సరిగా లేకపోవడం, సాంకేతిక సమస్యలు, అటవీ సమస్యలు ఉన్నట్లయితే ధన దృష్టికి తీసుకురావాలని, ప్రతి వారం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో బిల్లు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమ మండలాల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలను సమర్పించాలని సూచించారు. వచ్చే వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని, అవసరమైన చేతి పంపులు, బోరు బావులు, పైప్ లైన్ల మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా కలెక్టర్ కే. హరిత

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్**



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కే హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రములోని జనకాపూర్ లో గల మండల సమైఖ్య భవనంలో గ్రామీణాబివృద్ధి సంస్థ ఆద్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ హరిత సందర్శించారు. శిక్షణ కేంద్రంలో,సౌకర్యాలపై గ్రామీణాభివృద్ధి సంస్త ప్రాజెక్ట్ డైరెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు . ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ శిక్షణ కేంద్రం ద్వారా జిల్లాలోని ఆసిఫాబాద్, జైనూర్, సిర్పూర్, కాగజ్నఘర్,వాంకిడి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిదిలోని అంగన్వాడి కేంద్రాలకు వచ్చె పిల్లలకు 24765 జతల ఏకారూప దుస్తులు కుట్టి అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు . విద్యార్తులకు నాణ్యత కూడిన జతలను నిర్ణిత గడువులోగా అందించాలన్నారు. స్వయం సహాయక సంఘ మహిళలు ఈ శిక్షణ కేంద్రం ద్వారా ఏకరూప దుస్తులను కుట్టి ఆర్దికంగా బలోపేతం కావాలన్నారు.ఈ శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమములో గ్రామీణాబివ్రుద్ది శాఖా అధికారి దత్తారావు, సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు
### - స్వప్న హత్య బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 06, సూర్య మేజర్ న్యూస్:**

ఇటీవల హైదరాబాదులోని మొయినాబాద్ లో న్యాయవాది స్వప్నను హత్య చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్త కోర్టుల విధుల బహిష్కరణలో భాగంగా



బెల్లంపల్లి పట్టణంలో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిఫ్ కోర్టు లో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రధాన ద్వారం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకెం శివకుమార్, ప్రధాన కార్యదర్శి చేను రవికుమార్, సీనియర్ మహిళా న్యాయవాది నల్లుల సంగీత లు మాట్లాడారు. ప్రభుత్వం న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాద రక్షణ బిల్లును తీసుకురావాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పై జరుగుతున్న హత్యలు ప్రతి ఒక్కరు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు లగ్గిశెట్టి రాము, సునీల్, సంతోష్, వెంకటేష్, లావణ్య, జాడి రాజేష్, మురళి, శ్రావణ్, ఎం.డి జుబేర్, సందీప్ మద్దిబోయిన శ్రీనివాస్, దాసారపు రాజు పాల్గొన్నారు.

## పత్తిలో గులాబీ పురుగు విజృంభణ..
### - రైతు పంటపై కాటేసిన నిర్లక్ష్యం!

**చింతలమానేపల్లి, ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్**

మండలం పరిసర గ్రామాల్లో పత్తి పంటకు గులాబీ పురుగు తీవ్ర ముప్పుగా



మారింది. పచ్చగా పూసిన పత్తి కాయలు లోపలే పురుగు దాడితో పూర్తిగా పాడవుతూ రైతులకు తీవ్ర నష్టం తెచ్చిపెడుతున్నాయి. పై ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తున్నట్లుగా, బయటకు బాగానే ఉన్నట్లుగా కనిపించే పత్తి కాయలు తెరిచి చూస్తే లోపల తెల్లని పత్తి నాశనం అయి, గింజలు పనికిరాని స్థితికి చేరుతున్నాయి.పంట వేసే దశ నుంచి కోత సమయం వరకు లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన రైతులు, చివరికి చేతికి వచ్చే దిగుబడి చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురుగు నివారణపై ముందస్తు అవగాహన, సమయానికి అధికారులు స్పందించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ లోపించిందన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి, గులాబీ పురుగు నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో పత్తి సాగు మీదే రైతులకు నమ్మకం పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తమవుతోంది. పత్తి రైతును ఆదుకోవాల్సిన వ్యవస్థే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, పల్లెల్లో పంటల భవిష్యత్తే ప్రశ్నార్థకమవుతుంది.

### అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా
## పటిష్టమైన చర్యలు చేపట్టాలి
### - రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని సూచన
### - బేల పోలీస్ స్టేషన్ పరిశీలన
### - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.

**బేల, ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో మహిళల భద్రత, రక్షణ చర్యలు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు, జిల్లా పోలీసు యంత్రాంగం మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యతను



కేటాయిస్తుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం బేల పోలీస్ స్టేషన్‌లో మహిళా పోలీసు సిబ్బంది నిత్యవసర పనుల నిమిత్తం ప్రత్యేకంగా నూతన గదిని జిల్లా ఎస్పీ వేద మంత్రోచరణల నడుమ ప్రత్యేక



పూజలు నిర్వహించి మహిళా కానిస్టేబుల్‌లు ఏ లలిత, ఏ లక్ష్మీప్రియ లతో రిబ్బన్ కట్ చేయించి నూతన గదిని ప్రారంభించారు.పోలీస్ స్టేషన్లో ఉన్న వాహనాల ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డుల నవీకరణ ఎప్పటికప్పుడు జరగాలని అన్నారు. మహిళల రక్షణకై షీ టీం 24 గంటలు అందుబాటులో ఉంటూ రక్షణ చర్యలను చేపట్టాలని పేర్కొన్నారు. విపిఓ విధానాన్ని అమలు చేస్తూ గ్రామస్థాయిలో జరిగే ప్రతి అసాంఘిక కార్యకలాపాలపై పూర్తి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాలలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రతకై షీ టీం ఆధ్వర్యంలో పోలీసు అక్క కార్యక్రమం నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.మండల పరిధిలో గంజాయి, గుడుంబా వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పర్యవేక్షించాలని, రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పెండింగ్ కేసులు పూర్తి చేసి చార్జిషీట్‌లు దాఖలు చేయాలని తెలిపారు. గ్రామాలలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలను ప్రోత్సహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సిఐ జి శ్రావణ్, బేల ఎస్ఐ ఎల్ ప్రవీణ్ కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మైండ్స్పార్క్ తో డిజిటల్ విద్యాభివృద్ధి

**సిరికొండ, ఫిబ్రవరి,6 సూర్య మేజర్ న్యూస్**

డిజిటల్ లెర్నింగ్‌ను గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పిల్లలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న మైండ్స్పార్క్ కార్యక్రమం మరో అడుగు ముందేసింది. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ పరిధిలోని రాయిగూడ పాఠశాలకు



ఈ ఐ--మైండ్స్పార్క్ టీమ్ నాలుగు ల్యాప్‌టాప్‌లను అందజేసింది. పిల్లల వ్యక్తిగత అధ్యయన వేగాన్ని బట్టి నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించే అడాప్టివ్ లెర్నింగ్ విధానాన్ని మరింత ప్రభావవంతం చేయడంలో ఈ ల్యాప్‌టాప్‌లు సహాయపడతాయని ప్రోగ్రాం కోఆర్డినేటర్ కిషోర్ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ విద్యార్థులకు చేరేలా సంస్థ చేస్తున్న కృషిని ఆయన వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్, సిబ్బంది గజానంద్ నాయక్, శంభురావ్ మైండ్స్పార్క్ టీమ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఈ తరహా కార్యక్రమాలు దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు.

### బలరాం జాదవ్ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన
## కార్యదర్శి జన్మదిన వేడుకలు

**నేరడిగొండ ఫిబ్రవరి 6 సూర్య మేజర్ న్యూస్.**

రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ధార్మిక నగర్ లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి దాతలు అభిమానులు మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్ర అధ్యాపకుల సంఘం బలరాంజాదవ్ పై ఉన్న అభిమానం ప్రేమతో ప్రతి సంవత్సరం జన్మదిన వేడుకలను ఆయన సొంత గ్రామమైన ధార్మిక నగర్ లో జరుపుకుంటున్నారు. అలాగే ఈ సంవత్సరం అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించి 42 యూనిట్ల రక్తదానం చేసి బలరాం జాదవ్ పై ఉన్న అభిమానాన్ని బలంగా చాటుకున్నారు. ఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ నాపై ఉన్న అభిమానం అలాగే మండలంలోని యువత అభిమానులు మీరందరూ చూపే ప్రేమ పై మరింత బాధ్యతలు పెంచి ఎక్కువ సేవ చేసే విధంగా ప్రోత్సాహాన్ని ఇస్తుందని అన్నారు. అభిమానులు విద్యార్థులు యువకులు గ్రామ ప్రజలు వివిధ మండలాల నుంచి వచ్చి ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేసినందుకు వారందరికీ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ జన్మదినం వేడుకలలో మండలం లో ని విద్యార్థి అభిమానులతో పాటు వివిధ మండలాల ప్రజలు అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు.




### తపాలాపూర్ లో మహిళా మేడలోనుంచి
## తులంనర బంగారం అపహారణ

**జన్నారం, ఫిబ్రవరి 06, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం మండలం తపాలాపూర్లో గురువారం రాత్రి రామటెంకి లావణ్య మేడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి మహిళ మొకం పై కారం చల్లి తులంనర బంగారు పుస్తెల తాడుని అపహారించుకెళ్లారు. ఇంట్లో మహిళా రామటెంకి లావణ్య కూర్చొని ఉండగా అకస్మాత్తుగా గుర్తు తెలియని వ్యక్తి ముసుగు ధరించి మేడలో ఉన్న పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. ఈ విషయం గ్రామం లో ప్రచారం జరగగా గ్రామ పెద్దలు ఆమె ఇంటికి చేరుకున్నారు. ఎవరో ఒక వ్యక్తి ముసుగు ధరించి ఇంటికి వచ్చి ముఖం పై కారం చెల్లి మేడలో ఉన్నా బంగారు పుస్తెల తాడు బలవంతంగా లాక్కొని వెళ్లిపోయారని లావణ్య విలపిస్తూ చెప్పింది. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై గొల్లపల్లి అనూష ఆమె ఇంటికి వెళ్లి విచారించింది. లావణ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై అనూష తెలిపారు.



# బ్యాలెట్ పేపర్ల ముద్రణను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ, వెరిఫికేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం పరిశీలించారు. జడ్పీ కార్యాలయంలోని ముద్రణాలయం, స్ట్రాంగ్ రూమ్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లనుతనిఖీ చేశారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల నాణ్యత, అక్షర దోషాలు లేకుండా ముద్రణ జరుగుతున్నదా, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి దశను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీఏ రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అభ్యర్థులు ఖర్చులను స్పష్టంగా నమోదు చేయాలి
### - మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్ :**

2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో పోటీలో ఉండే అభ్యర్థులు తమ



ఖర్చుల వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు దేవేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో పోటీలో ఉన్న అభ్యర్థులతో వ్యయ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ అభ్యర్థులు తమ ఖర్చులను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు, ర్యాలీల కొరకు ముందస్తుగా అనుమతి పొందాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం ఖర్చులను నమోదు చేసి వివరాలను నిర్దిష్ట కాలపరిమితిలో సమర్పించాలని సూచించారు. ప్రత్యేక బ్యాంకు ఖాతా నిర్వహణ, రికార్డుల సంరక్షణ, ఖర్చుల పరిమితులపై సమగ్ర అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఖర్చుల పరిమితిని అధిగమించినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ నోడల్ అధికారి నదీమ్ ఖుద్దుసి, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ గజానన్, మాస్టర్ ట్రైనర్ ఊసన్న, ఎన్నికల విభాగం అధికారులు, పోటీలో ఉన్న అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో
## కలపకు అనుమతులు తప్పనిసరి
### - అక్రమ రవాణాపై కఠిన చర్యలు
### - ఎఫ్ఎస్ఓ చంద్రారెడ్డి

**సిరికొండ, ఫిబ్రవరి 6 సూర్య మేజర్ న్యూస్,**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కలప వినియోగానికి సంబంధించి లబ్ధిదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎఫ్ఎస్ఓ చంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో ఉపయోగించే తలుపులు, కిటికీల కోసం పాత కలపను వాడినా కూడా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని స్పష్టం చేశారు. కలపను అక్రమంగా తరలించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు దత్తాత్రి, ఉప సర్పంచ్ తోకల రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇమామ్, వార్డు సభ్యులు సందీప్, ఇమామ్, బీట్ ఆఫీసర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



### యువత దేశ రక్షణలో భాగస్వాములు కావాలి
## .. కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**



దేశ రక్షణలో భాగస్వాములు కావాలనుకునే యువతకు భారత సైన్యం గొప్ప వేదికని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారత సైన్యంలో చేరడం అంటే కేవలం ఒక ఉద్యోగాన్ని సంపాదించడం కాదని, అది దేశం పట్ల మమకారాన్ని చాటుకునే ఒక గౌరవప్రదమైన జీవనశైలి అని అన్నారు. క్రమశిక్షణ, సాహసం, దేశభక్తి కలగలిసిన సైనిక జీవితం యువతకు ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందని తెలిపారు. జిల్లాలోని అర్హులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సరిహద్దు రక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఆర్మీ రిక్రూటింగ్ అధికారులు పాల్గొని సైన్యంలో వివిధ విభాగాల్లో ఉన్న అవకాశాలు, ఎంపిక ప్రక్రియ, శారీరక దారుఢ్య పరీక్షలు, రాత పరీక్షలకు సిద్ధమయ్యే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్, ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారులకు దుస్తుల పంపిణీ

**కడెం, సూర్య మేజర్ న్యూస్:**మండలంలోని పాండ్వాపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు శుక్రవారం అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దుస్తుల పంపిణి చేసారు. ఈ సందర్భంగా పాండ్వాపూర్ ఉపసర్పంచ్ గొర్రె మధుకర్



అంగన్వాడి నిర్వాహకులు అక్షరాభ్యాసంతోపాటు బాలామృతం,గుడ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రాజమణి,కార్యదర్శి మమత,వార్డు సభ్యులు కనగంటి మల్లేష్,ఎల్లి శంకర్, బండి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉత్తర్,ఆశ వర్కర్ వనజ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బలగాల్లో ఉద్యోగం సాధించిన యువకులకు సన్మానం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి6, సూర్య మేజర్ న్యూస్:**

కేంద్ర బలగాల్లో ఉద్యోగాలు సాధించిన పెంచికల్ పేట్ మండలనీకి చెందిన యువకులను ఎస్సై అనిల్ కుమార్ అభినందించి శుక్రవారం సత్కరించారు. పోతపల్లి గ్రామానికి చెందిన ఎలకరి రాజశేఖర్ (సిఐఎస్ఎఫ్), ఏల్లూరు గ్రామానికి చెందిన దుర్గం కిరణ్ (సిఆర్పిఎఫ్), దుర్గం చిరంజీవి (సిఐఎస్ఎఫ్), పులగం ప్రవీణ్ (సిఐఎస్ఎఫ్), రౌతు సంతోష్ (సిఐఎస్ఎఫ్)లు ఇటీవల వెలువడిన కేంద్ర బలగాల ఫలితాల్లో ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ కుమార్వమాట్లాడుతూ ఈ యువకులును ఆదర్శంగా తీసుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రభుత్వ కొలువులు సాధించాలని సూచించారు. పట్టుదల కలిగిన యువకులకు తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్స్ శ్రీకాంత్, శ్యామ్ పాల్గొన్నారు.



## ఇంటర్ ప్రశ్న, జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూంలో బద్రపర్చాలి .. జిల్లా కలెక్టర్; కే. హరిత

**ఆసిఫాబాద్ ప్రతినిధి,ఫిబ్రవరి06 ,సూర్య మేజర్ న్యూస్ :**

ఇంటర్ ప్రశ్న, జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూంలో బద్రపర్చాలని జిల్లా కలెక్టర్ కే హరిత అన్నారు శుక్రవారంశుక్రవారం జిల్లాకు కేటాయించిన ప్రశ్న



జవాబు పత్రాల వాహనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుండి మార్చి 31 వరకు ఇంటర్ వార్షిక పరిక్షలు ఉన్నందున ప్రశ్న, జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూంలో బద్రపర్చి పోలీసు బందోబస్తు కల్పించాలన్నారు. జిల్లాలో ఇంటర్ వార్షిక పరిక్షలకు 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని 9716మంది విద్యార్తులు పరిక్షలకు హాజరౌతారని , కలెక్టర్ తెలిపారు. ఆ దిశగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి రాందాస్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమములో సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పోటీ చేసే అభ్యర్థులు ఎంత ఖర్చు చేస్తున్నారో తెలపాలి

కాగజ్నగర్, ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్ :

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మున్సిపల్ కమిషనర్ తిరుపతి మరియు ఎన్నికల పరిశీలకుడు దేవేంద్ర ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లో




ఎన్నికల వ్యయ నిర్వహణపై మునిసిపల్ కౌన్సిలర్లుగా పోటీలో ఉన్న అభ్యర్థులతో శుక్రవారం సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎన్నికల ఖర్చులను ఎన్నికల నియమావళి ప్రకారం నమోదు చేసి, ఖర్చుల వివరాలను నిర్దిష్ట కాలపరిమితిలో సమర్పించాలని అభ్యర్థులకు సూచించారు. ఖర్చుల పరిమితులు, ప్రత్యేక బ్యాంకు ఖాతా నిర్వహణ, రికార్డుల సంరక్షణపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎన్నికల ట్రైనర్ అసిఫ్ ఖర్చుల నోడల్ అధికారి, నదీమ్ కుద్దుసి పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకం : అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్

**నిర్మల్ ప్రతినిధి ఫిబ్రవరి 5, సూర్య మేజర్ న్యూస్.**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు రెండవ విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వర్తించే అధికారులకు పలు కీలక సూచనలు చేసారు. శిక్షణలో, శిక్షకులు అందించే వివరాలను సమగ్రంగా తెలుసుకొని ఎన్నికల్లో విధుల్లో పాల్గొనాలని అన్నారు. సిబ్బందికి సమయపాలన క్రమశిక్షణ అత్యంత కీలకమని గుర్తు చేసారు. బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వర్తించి, ఎన్నికల ప్రక్రియను మొత్తం దిగ్విజయంగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డీఈవో భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.






# సదల్ పూర్ ఆలయాన్ని దర్శించుకున్న ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్, సూర్య మేజర్ న్యూస్**



శాతవాహనుల కాలంనాటి శివాలయం మరియు భైరవదేవుని ఆలయాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించారు. మొదటగా డప్పు వాయిద్యాలు నడుమ ఎస్పీని ఘనంగా ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు దర్శనాన్ని గావించారు. ఆలయంలో శివలింగానికి జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పక్కనే ఉన్న భైరవదేవని దర్శించి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీకి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సిఐ జి శ్రావణ్,బేల ఎస్ఐ ఎల్ ప్రవీణ్, ఆలయ కమిటీ సభ్యులు ఆడే శంకర్, కోరంగి వంశస్థులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## అధికార పార్టీ తోనే అభివృద్ధి సాధ్యం
### - 3 వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి పత్తి ప్రకృతి వెంకటేష్

**నస్పూర్, ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి, అధికారంలో ఉన్న కాంగ్రెస్




తోనే సాధ్యమవుతుందని, శుక్రవారం కృష్ణ కాలనీలో జరిగిన ఇంటింటి ప్రచారం లో 3 వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి పత్తి ప్రకృతి వెంకటేష్ అన్నారు. విద్యావంతుడు, తండ్రి ఆశయాలతో ముందుకు వస్తూ, ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని, కాలనీలలో ఉన్న సమస్యలు పరిష్కరించి, నిస్వార్థంగా వార్డు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

## నేవీలో ఎంపికైన యువకుడికి సన్మానం

**సిరికొండ, ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్**

భారత నేవీలో చేరిన దోండే సాయినాథ్, కుటుంబ సభ్యులను గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. సిరికొండ గ్రామానికి చెందిన సాయినాథ్ నేవీలో ఎంపికవడంతో గ్రామంలో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ



పెద్దలు, యువకులు కలిసి ఆయన కుటుంబాన్ని అభినందించారు. గ్రామ యువతకు సాయినాథ్ ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, బషీర్, అశోక్, గంగాధర్, దత్తు, బొజ్జ రెడ్డి, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతో తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రచారం

**కాగజ్నగర్, ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్ :**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ పట్టణంలో శనివారం జరిగే మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సభాస్థలిని పరిశీలించిన సిర్పూర్ శాసనసభ్య డా.పాల్వాయి హరీష్ బాబు.కాగజ్ నగర్ పట్టణంలోని ఎస్పీయం క్రికెట్ మైదానంలో శనివారం మధ్యాహ్నం 12గం.లకు జరగనున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మునిసిపల్ సంకల్ప సభ కోసం సభాస్థలిని పరిశీలించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ కాగజ్ నగర్ ప్రజలు మార్పు కోరుతున్నారని, మున్సిపాలిటీ అభివృద్ధి కోసం కాషాయ జెండా వైపు చూస్తున్నారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార నిమిత్తం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కాగజ్ నగర్ పట్టణానికి విచ్చేస్తున్నారని, ప్రతి వార్డు నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సభ ద్వారా భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు మరియు నాయకులు విజయ సంకల్పాన్ని ప్రకటించాలని ఆయన కోరారు.



## గురుకుల కోచింగ్ సెంటర్ ప్రారంభం

**పెంచికల్ పేట్, ఫిబ్రవరి6, సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని ఎల్లూరు, కొత్త గుడ, కోయాచిచ్చల పెంచికల్ పేట్ గ్రామాల 4వ, 5వ, 6, 7వ తరగతులు చదువుతున్నా విద్యార్థుల ఉన్నత చదుల కొరకు




ఎస్సీ,ఎస్టీ,బిసి.,మైనార్టీ గురుకుల ప్రవేశ పరీక్షల కోసం పేద విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ సెంటర్‌ను స్వేరోస్ ఆధ్వర్యంలో సర్పంచ్ చప్పిడే రవీందర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసర గ్రామల విద్యార్థులు, ఈ సదావకాశాన్ని సద్వినియోగాం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్వేరో మండల అధ్యక్షులు ఒండ్రె ప్రేమనందం,ప్రభుత్వ ఉపాధ్యాయులు డోకే శేఖర్,సత్యనారాయణ, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ అభివృద్ధి, బిఆర్ఎస్ తోనే సాధ్యం
### .. మాజీ మంత్రి హరీష్ రావు

**నస్పూర్, ఫిబ్రవరి 6, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ తోనే



సాధ్యమవుతుందని, బిఆర్ఎస్ కార్పొరేటర్ లను గెలిపించాలని నస్పూర్ సిర్కే చౌరస్తాలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతో కష్టపడి ఎందరో త్యాగాల మీద తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు . మంచిర్యాల్ పట్టణ ప్రజల ఎన్నో సంవత్సరాల కళ అయినా మంచిర్యాల జిల్లాను ఏర్పాటు చేసింది కేసీఆర్ అని పేర్కొన్నారు. జిల్లా అయిన తర్వాత కలెక్టరేట్, మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని అవి ఇప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని ఉద్యోగాలు ఇవ్వడం లేదని తెలియజేశారు. రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి నాశనం చేస్తున్నాడని విమర్శించాడు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సింగరేణి కార్మికుల ఇన్కమ్ టాక్స్ రద్దు చేసిన తర్వాతే బిజెపి నాయకులు ఓట్లు అడగాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్ రావు, బాల్క సుమన్, నస్పూర్ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అక్కురు సుబ్బయ్య, నాయకులు విజిత్ రావు, టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి ,కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కార్పొరేటర్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రవెల్లి లో గ్రామ సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 06, సూర్య మేజర్ న్యూస్:**

బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో గ్రామ సంఘాల భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం డిఎంపి నీలతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గజేల్లి రాజకుమార్, వార్డు సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దాసరి దామోదర్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కంపల చందు, కాంగ్రెస్ నాయకులు పూదరి గణేష్, ఎండి రియాజ్, రాచకొండ శంకర్, జాడి స్వామి, గడ్డం శేఖర్, కళ్యాణం శంకర్, ఏపీఎం విజయలక్ష్మి, సీసీలు అంజలి, గ్రామైక్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సేవకు సంతృప్తి - కృషికి గుర్తింపు

### - పదవి విరమణ పొందుతున్న హోంగార్డు ను ఘనంగా సత్కరించి వీడుకోలు పలికిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

**నిర్మల్ ప్రతినిధి ఫిబ్రవరి 5, సూర్య మేజర్ న్యూస్.**

42 ఏళ్ల సుదీర్ఘ సేవల అనంతరం నేడు పదవి విరమణ పొందుతున్న హోం




గార్డు ఎస్కే కలీం (హెచ్ జి 359)ను, జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 1984 సంవత్సరంలో హోం గార్డుగా పోలీసు శాఖలో చేరిన ఎస్కే కలీం, 42 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు అంకితభావంతో సేవలు అందించి ఈరోజు పదవీ విరమణ చేశారు.ఎస్కే కలీం, పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడుతూ, విధి నిర్వహణలో ఆయన చూపిన నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. అలాగే వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితి గురించి ఆప్యాయంగా అడిగి తెలుసుకుని, భవిష్యత్తులో మంచి ఆరోగ్యం, శాంతియుత జీవితం గడపాలని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలతో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి(అడ్మిన్), ఏవో యూనుస్ అలీ, ఆర్ ఐ శేఖర్, ఏ ఆర్.ఎస్ఐ ఉన్నారు.

## తెలంగాణ ఉద్యమ సారథి,రాష్ట్ర సాధకుడు,జాతిపిత కెసిఆర్
### - ఆయనను రేవంత్ రెడ్డి కించపరిచేలా మాట్లాడడం సరికాదు
### - కాంగ్రెస్ కు తగిన గుణపాఠం చెప్పాలి- పడకంటి రమాదేవి

**లోకేశ్వరం సూర్య మేజర్ న్యూస్**

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సారథి, రాష్ట్ర సాధకుడు,జాతిపిత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అని బిఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యురాలు డాక్టర్ పడకండి రమాదేవి



అన్నారు.లోకేశ్వరం మండలం గొడిసెరా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ జెండాను శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ ప్రజలు నీళ్లు లేక తిండి లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఆ రోజుల్లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీలు పెంచి వసూలు చేయాలని జీవోను తీసుకురావడం సహించలేక తన పదవికి రాజీనామా చేసి ౹=ా పార్టీని స్థాపించారు.అన్ని వర్గాల ప్రజలను ఒక తాటిపై తీసుకువచ్చి సకల జనుల సమ్మెతో ఉద్యమానికి ఊపిరి పోసి చావు నోట్లో తలపెట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసిఆర్ దని గుర్తుకు చేశారు.పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజలకు సంక్షేమ పథకాలు, పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్, రైతులకు రుణమాఫీ, వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్తు,సరిపడా ఎరువులు,వైకుంఠధామాలు, పేద పిల్లలకు ఉన్నత విద్యను అందించేందుకు గురుకులాలు, భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు,మిషన్ కాకతీయ ద్వారా ప్రాజెక్టులు,తదితరాలను అందించి ప్రపంచం నలుమూలల తెలంగాణ ఖ్యాతిని చాటి చెప్పేలా పాలన సాగించారని తెలిపారు.అంతటి మహనీయున్ని సీఎం హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి.. ఎవడవురా నీవు...? నీ కండ్లు పీకేసి గోటిలాడతా...పేగులు తీసి మెడలో వేసుకుంటానని...ఇష్టం వచ్చినట్లు కించపరిచేలా మాట్లాడడం సరికాదని మండిపడ్డారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో మహిళలు ఒకరినొకరు సికలు(జుట్లు)పట్టుకొని కొట్లాడుకుంటున్న ఒక్క ఉచిత బస్సు ప్రయాణం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని,పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణ లక్ష్మి కింద తులం బంగారం ఒట్టి మాటలేనని,500/ రూపాయలకే సిలిండర్ మూన్నాల ముచ్చటే అయిందని,పెన్షన్ల పెంపు పేరుకే లేదని దుయ్యబట్టారు. ఒక్కో ప్రతి కార్యకర్త కెసిఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి అందించిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి కాంగ్రెస్ పాలన–బిఆర్ఎస్ పాలనకు తేడాలను వివరించి పార్టీ బలోపేతానికి పాట పాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంటెన్నోళ్ల గంగాధర్,వినేష్, నరేష్,దివాకర్, రమేష్,కరుణాసాగర్, సుశాంత్,ఉప సర్పంచ్ కే.లక్ష్మి, వార్డు మెంబర్లు,మహిళలు, యువకులు, గ్రామస్తులు,మరియు తదితరులు పాల్గొన్నారు.